నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | డిసెంబర్ 25, 2023 | www.navatelangana.com

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని బోనాల్ గ్రామానికి చెందిన వడ్ల లక్ష్మీకాంతయ్య గత మూడు రోజుల క్రితం మృతి చెందడంతో ఆదివారం పదో తరగతి బ్యాచ్‌కు చెందిన మిత్రులు బోనాల గ్రామం వెళ్లి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. అన్ని విధాలుగా ఆదుకుంటామని కుటుంబానికి భరోసానిచ్చారు. కార్యక్రమంలో మన్నే సాయిలు, బాలమల్లు, కొట్టల శేఖర్, రాజారాం, బాలరాజు, భాషు మెకానిక్ యూనియన్ ప్రెసిడెంట్, రియాజ్, దత్తు పాల్గొన్నారు.

సెంట్రల్ లైనింగ్ పనులు ప్రారంభం



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కళ్యాపూర్ ప్రధాన చౌరస్తాలో జెడ్పిటిసి నిధుల నుంచి రూ.1,50,000 మంజూరు కాగా.. ఆ నిధులతో సెంట్రల్ లైనింగ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సంయుక్త గంగదాసు, మాజీ సర్పంచ్ మైని మోహన్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు నాగరాజ్, శ్రీను, మోహన్ గ్రామ పెద్దలు యువత పాల్గొన్నారు.

రబీ.. రందీ..

• అందని పంట పెట్టుబడి సాయం • అప్పులు చేస్తున్న రైతులు • ఆందోళనలో అన్నదాతలు


నవతెలంగాణ-లింగంపేట్

రబీ సీజన్ ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నా నేటికీ రైతులకు పెట్టుబడి సాయం అందకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వడ్డీ వ్యాపారుల వద్ద నగలు తాకట్టుపెట్టి అప్పులు చేసి పంటలు సాగు చేసుకుంటున్నారు.

రబీ సీజన్ ప్రారంభమైంది. రైతులు వరి నారు ముందస్తుగానే వేశారు. ప్రస్తుతం వరి నాటు వేయడానికి సిద్ధమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 3 లక్షల 18 వేల ఎకరాలలో వివిధ రకాల పంటలను రైతులు సాగుచేస్తారని అధికారులు అంచనా వేశారు. ఇందులో ముఖ్యంగా వరి, శనగ, మొక్కజొన్న పంటలు అధిక శాతం సాగు చేసే అవకాశాలున్నాయని చెబుతున్నారు.



నాటు వేస్తున్న కూలీలు



రబీలో రైతుల రందీ..

రబీ సీజన్ ప్రారంభం కావడంతో పెట్టుబడి సాయం అందక రైతుల్లో రంది నెలకొంది. రబీసీజన్ ప్రారంభమై 15 రోజులు సమీపిస్తున్న పెట్టుబడి సాయం అందకపోవడంతో రైతులు వరి నాట్లు వేసేందుకు ప్రైవేటు అప్పులు చేస్తున్నారు. ఫైనాన్స్ కంపెనీల వద్ద నగలు తాకట్టు పెట్టి పెట్టుబడి కోసం పైసలు తీసుకొని వరి నాట్లు వేస్తున్నారు. రబీలో ఎకరా వరి పంట సాగు చేసేందుకు 20 నుంచి 25 వేల పెట్టుబడి అవసరం. ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు, భూమి చదునుతో పాటు కలుపు, వరి కోతల వరకు రూ.25 వేల పెట్టుబడులు అవసరం. దీంతో రైతులు పెట్టుబడి సాయం కోసం నిరీక్షిస్తున్నారు. గత సంవత్సరం నవంబర్ నెలలోనే రైతులకు పెట్టుబడి సాయం అప్పటి ప్రభుత్వం అందజేసింది. ప్రస్తుతం ప్రభుత్వం పెట్టుబడి సాయం నిధులు విడుదల చేస్తామని ఆదేశాలు జారీ చేసినప్పటికీ కేవలం ఎకరా లోపున రైతులకు పెట్టుబడి సాయం వారి ఖాతాలో జమైంది. ఎకరం ఉన్న రైతులకు సైతం వారి ఖాతాలో డబ్బులు జమ కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం పంట పెట్టుబడి సాయాన్ని పెంచి ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఎకరాకు రూ.5000 చొప్పున ఈసారి పాత విధానమే కొనసాగిస్తామని ప్రభుత్వం చెప్పింది. పూర్తిస్థాయిలో పంట పెట్టుబడి రైతుల ఖాతాల్లో జమకాకపోవడంతో రైతులు వరి నాటు వేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

అప్పులు చేశాం

పెట్టుబడి సాయం రాక అప్పులు చేశాం. నా పేరు మీద 37 గుంటలు భూమి ఉంది. ఇప్పటివరకు ఖాతాలో డబ్బులు జమ కాలేదు. చేసేదేమీ లేక అప్పులు చేసి వారి నాటు వేస్తున్నాం.

- పోచయ్య, రైతు సజ్జనపల్లి.

ఇప్పటికి జమ కాలేదు

వరి నాట్లు వేస్తున్నాం. మాకు ఇప్పటి వరకు పెట్టుబడి సాయం జామ కాలేదు. అప్పులు చేసి ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేశాం. ప్రభుత్వం సకాలంలో పెట్టుబడి సాయం అందిస్తే కొంత మేలు జరుగుతుంది.

- సంగమేశ్వర్, రైతు బానాపూర్.

బిల్లులు మంజూరు గాక..
అసంపూర్తిగా 'డబుల్ ఇండ్లు'

• అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం అమ్దాపూర్ గ్రామంలో, సాలుర మండలం కుమ్మన్‌పల్లి గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించిన బిల్లులు మంజూరు కాకపోవడంతో ప్రస్తుతం ఇండ్ల నిర్మాణం పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. దాంతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం ఎదురుచూస్తున్న నిరుపేదలు వారి కలలు నెరవేరక ఇబ్బందులు పడుతున్నారు. అమ్దాపూర్ గ్రామంలో 24 డబుల్ బెడ్ రూం ఇండ్లు, కుమ్మన్‌పల్లిలో 30 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించారు. అంత వరకు బాగానే ఉన్న గత ప్రభుత్వం బిల్లులు మంజూరి చేయడంలో అలసత్వం వహించడంతో డబుల్ బెడ్ రూం ఇండ్లు అసంపూర్తిగా మిగిలాయి. కుమ్మన్‌పల్లి గ్రామంలో నిర్మించిన ఇండ్లకు తలుపులు, కిటికీలు బిగించకపోవడంతో అవి మందు బాబులకు, అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా మారాయి. అమ్దాపూర్ గ్రామంలో మరికొన్ని పనులు మిగలడంతో బిల్లులు మంజూరి కాలేదు. దాంతో రంగులు వేసి సిద్ధం చేసిన ఇండ్లు పంపిణీ చేరడం లేదు. హౌజింగ్ శాఖ ఏఈ నాగేశ్వరరావును వివరణ కోరగా బిల్లులు మంజూరికాక ప్రాథమిక దశలో పనులు నిలిచిపోవడంతో ఇండ్లు పూర్తి కాలేదని, కొత్త ప్రభుత్వం చేపట్టే నిర్ణయాల మేరకు చర్యలు చేపడతామని తెలిపారు.



కుమ్మన్ పల్లిలో అసంపూర్తిగా మిగిలిన డబుల్ బెడ్ రూంలు

త్త్వైకాండో బెల్టు గ్రేడింగ్ సర్టిఫికెట్స్ ప్రదానం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని ఇటీవల ప్రజ్ఞ ఐఐటి పాఠశాలలో తైకొండో గ్రాండ్ మాస్టర్, తైకొండో జిల్లా ప్రధాన కార్యదర్శి జి.భోజన్న ఆధ్వర్యంలో 110 మంది విద్యార్థులకు బెల్ట్ టెస్ట్ పోటీలను నిర్వహించారు. వారికి ఆదివారం బెల్టు గ్రేడింగ్ సర్టిఫికెట్‌స ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సూరజ్ కుమార్, ఎం రాజన్న, శ్రీనివాస్ విచ్చేశారు. నిహాల్ (బ్లూ బెల్ట్), రాజా అర్జున్, రాజు విన్, ఆనంద్, భరత్, సాయి గణేష్, శశింద్ర, బి గణేష్, కార్తికేయ, లలిత్(గ్రీన్ బెల్ట్), జి అరూష్, కసాబ్, విశ్వక్షు, ఆర్యన్ (యెల్లో 1 బెల్ట్), జీవి వివన్ (యెల్లో బెల్ట్), చంద్ర స్కూల్ నుండి 15 మంది (యెల్లో 1 బెల్ట్), 49 మంది పిల్లలు ఎల్లో బెల్ట్ పొందారు. త్త్వైకాండో బెల్ట్ గ్రేడింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారందరికీ గ్రేడింగ్ బెల్ట్‌లు, సర్టిఫికెట్స్ ఇచ్చి వారిని అభినందించారు. శ్రీ చంద్ర టెక్నో స్కూల్ ముబారక్ నగర్ నుండి 70 మంది విద్యార్థులు, పట్టణంలోని వివిధ పాఠశాల నుండి 40 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు.



రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-మోపాల్

నిజామాబాద్ జిల్లా 369/2021 రెడ్డి సంక్షేమ సంఘం కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం వినాయక్‌నగర్‌లోని కర్కరాజారెడ్డి నిలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించినట్టు జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుడిపల్లి నాగిరెడ్డి, చంద్ర శేకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మోటాడి రెడ్డిలు జిల్లా కేంద్రంలో స్థిర పడ్డ 129 కుటుంబాలకు చెందిన వారు ఈ సమావేశంలో పాల్గొని నూతన కమిటీని ఎన్నుకున్నట్టు తెలిపారు. జిల్లా రెడ్డి సంక్షేమ నూతన అధ్యక్షులుగా గుడిపల్లి నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మూల జగన్ రెడ్డి, కోశాధికారిగా ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా గాదరి సంజీవ్ రెడ్డి, ల్యాబ్ కర్క గంగారెడ్డి, సాయరెడ్డి, సుధాకర్ రెడ్డి, ఉల్లెంగ గంగారెడ్డి, ఆర్గనైజషన్ సెక్రటరీగా జితేందర్ రెడ్డి, శ్రవణ్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా ఒంటెల గంగారెడ్డి, కె. గంగారెడ్డి, అరికెల శ్రీకాంత్ రెడ్డి, బేతి రవి కుమార్ రెడ్డి, కుమార్ రెడ్డి, సలహా దారులుగా విజయందర్ రెడ్డి, కృష్ణ రెడ్డి, చెన్నారెడ్డి, న్యాయ సలహా దారులుగా నల్ల సుభాషరెడ్డిని ఎన్నుకున్నారు. ఈసి మెంబర్లుగా అన్నం సతీష్ రెడ్డి, దామోదర్ రెడ్డి, నవీన్ రెడ్డి, సురేందర్ రెడ్డి, సవిన్ రెడ్డి, నారాయణ రెడ్డి, కరుణ కర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి ఎన్నికయినట్లు ఎన్నికల అధికారిగా వ్యవరించిన శేఖర్ తెలిపారు.

నాటు కోళ్ల పెంపకానికి శిక్షణ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నాటు కోళ్ల పెంపకానికి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఐకెపి ఎపిఎం రవీందర్ రెడ్డి ఆదివారం తెలిపారు. నాటు కోళ్ల పెంపకంపై ఆసక్తిగల మహిళలకు డిచ్‌పల్లి మండల కేంద్రంలోని మండల మహిళా సమైక్య కార్యాలయంలో ఈనెల 27న శిక్షణ కార్యక్రమం ఉంటుందని, ఆసక్తిగల మహిళలు వివోఏ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

మల్లన్న గుట్టకు పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న ప్రజలు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని లొంగన్ గ్రామానికి చెందిన భక్తులు మల్లన్న గుట్టకు ప్రతి ఏటా వెళ్తారు. అందులో భాగంగా ఆదివారం సైతం భారీగా గుట్టకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు సదుపటేల్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. భక్తీ శ్రద్దలతో భక్తులు పాదయాత్రగా జహీరాబాద్ వద్ద గల మల్లన్న గుట్టకు తరలివెళ్లారు. గ్రామస్తులకు ప్రత్యేకంగా సాంప్రదాయంగా గాంధీ టోపిలు, టవల్స్ ఇచ్చి గౌరవించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగలగిద్దే ఉషారాణీ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు లేక ఇబ్బందులు

• మరమ్మతులు ఎప్పుడో?

నవతెలంగాణ-సదాశివనగర్

కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని కల్వరాల్-పద్మాజివాడి గ్రామాల మధ్య మట్టి రోడ్డు వేశారు. ఈ రెండు గ్రామాల మధ్య వాగుపైన బ్రిడ్జిని నిర్మించారు. కానీ రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. ఈ విషయాన్ని ఇరు గ్రామాల ప్రజలు అప్పటి ఎమ్మెల్యే జాజాల సురేందర్ దృష్టికి తెచ్చినా పట్టించుకోకుండా పోయారు. అయితే ఈ సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు తాత్కాలికంగా బ్రిడ్జికి ఇరువైపులా వేసిన రోడ్లు కొట్టుకుపోయాయి. నెలలు గడిచినా పట్టించుకునేవారు కరువయ్యారు.



బ్రిడ్జీ నిర్మించినా.. సరిగా లేని రోడ్డు

కల్వరాల్ గ్రామస్తులు ప్రతి పనికీ పద్మాజివాడి చౌరస్తాకు రావలసి ఉంటుంది. ఎరువుల కోసం బాన్సువాడకు, ప్రాథమిక సహకార సంఘానికి, రైతువేదికకు, వార సంతకు, ఇవే కాకుండా నిత్యావసర సరుకులకు, పాలు అమ్మాలన్నా, పాలు కొనాలన్నా పద్మాజివాడికి రావలసి ఉంటుంది. రాత్రి వేలల్లో ఆదమరిస్తే అంతే సంగతి. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం ఈ రోడ్డును బాగుచేసి తారు రోడ్డు నిర్మించాలని ఇరుగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రజాసమస్యలు ఎక్కడుంటే అక్కడ ఎర్రజెండా

• సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్

నవతెలంగాణ-లింగంపేట్

ప్రజాసమస్యలు ఎక్కడుంటే అక్కడ ఎర్రజెండా ఉంటుందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) 2024 సభ్యత్వం రెన్యూవల్‌ను జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్, జిల్లా కోర్‌కమిటీ సభ్యులు మోతీరాం నాయక్ ప్రారంభించారు. అనంతరం వెంకట్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజలకు సమస్యలు ఉన్నంత వరకు కమ్యూనిస్టుపార్టీ ఉంటుందన్నారు. ఆనాటి నుంచి ఎన్నో పోరాటాలను నడిపిన చరిత్ర సీపీఐ(ఎం) పార్టీకి ఉందని తెలిపారు. పోరాటాల ఫలితంగా ప్రజాస్వామ్యం బతికి ఉందని అన్నారు. ప్రస్తుతం కార్పొరేట్ రాజకీయలతో ప్రజాస్వామ్యం కూనీ అవుతుందని, ప్రజాస్వామ్య వాదులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, సావిత్రి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ రెన్యూవల్ చేపడుతున్న నాయకులు

సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

వాహనదారులు సరైనా ధ్రువపత్రాలు కలిగి ఉండాలని పోలీసులు సూచించారు. ఆదివారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. వాహనదారులు పెండింగ్‌లో ఉన్న చలనాలు చెల్లించాలని వాహదారులకు తెలిపారు. వాహనదారులు సరైనా ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా ద్విచక్ర వాహనదారులు ట్రాఫిక్ నిబంధనల ప్రకారం వాహనదారులు హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సిద్ధికి, సిబ్బంది పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన రాజేశ్వరరావు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

క్రిస్టమస్ పండుగను పురస్కరించుకొని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిని మాజీ ఎమ్మెల్సీ, మాజీ క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ రాజేశ్వర్ రావు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావుకు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి దంపతులు క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

క్రిస్మస్‌ను ఆనందోత్సహాల మధ్య జరుపుకోవాలి

• జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్
• ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

నవతెలంగాణ-కామారెడ్డి/ఎల్లారెడ్డి

యేసుక్రీస్తు జన్మదినోత్సవమైన క్రిస్మస్ పర్వదినాన్ని ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆకాంక్షించారు. సోమవారం క్రిస్మస్ పండగను పురస్కరించుకొని కలెక్టర్ క్రిస్టియన్ సోదరులు, సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. యేసు క్రీస్తు జన్మదినం సందర్భంగా క్రైస్తవులు క్రిస్మస్ పండుగను ఎంతో పవిత్రంగా జరుపుకుంటారని.. క్రీస్తు కరుణామయుడుగా, దయామయుడుగా ఆయన అందరి ఆరాధనలు అందుకుంటున్నారని అన్నారు. సాటి మనుషుల పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమ, ఆకాశమంతటి సహనం, అవధులు లేని త్యాగం, శాంతియుత సహజీవనం, శత్రువుల పట్ల సైతం క్షమా గుణం కలిగి ఉండటమే యేసుక్రీస్తు అందరికి ప్రబోధించారని, దీనిని అనుసరించాలని కలెక్టర్ పాటిల్ కోరారు. క్రిస్మస్ పర్వదినాన్ని ఆనందంగా జరుపుకోవాలని కలెక్టర్ ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

నియోజకవర్గ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు..

ఎల్లారెడ్డి : యేసుక్రీస్తు జన్మదినోత్సవమైన క్రిస్మస్ పర్వదినాన్ని ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు అన్నారు. సోమవారం క్రిస్మస్ పండగను పురస్కరించుకొని క్రిస్టియన్ సోదరులు, సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు ఆయన తెలిపారు. యేసు క్రీస్తు జన్మదినం సందర్భంగా క్రైస్తవులు క్రిస్మస్ పండుగను ఎంతో పవిత్రంగా జరుపుకుంటారని, క్రీస్తు కరుణామయుడుగా, దయామయుడుగా ఆయన అందరి ఆరాధనలు అందుకుంటున్నారని అన్నారు.

కందకుర్తిలో వికాసిత్ భారత్ సంకల్పయాత్ర

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించడానికి వికాసిత్ భారత్ సంకల్పయాత్ర ద్వారా అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన 17 శాఖల అధికారులతో వివిధ రకాల పథకాల గురించి ప్రజలకు వివరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఉజ్వల యోజన, రైతు సంక్షేమానికి భరోసా, పీఎం విశ్వకర్మ పథకం కింద 18 సంప్రదాయ వృత్తుల వారికి చేయూత అందించనున్నట్లు వారు పేర్కొన్నారు. విశ్వకర్మ సోదరీమణులకు రూ.3లక్షల వరకు హామీ రైతన్నకు లభిస్తుందని ఎంపీడీవో శంకర్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మీర్జా కలీం బేగ్, నీలా సింగిల్ విండో చైర్మన్ ఇమామ్ బేగ్, ఎంపీటీసీ అస్సాద్ బేగ్, ఉప సర్పంచ్ దేవోళ్ళ యోగేష్, గ్రామ కార్యదర్శి నవీన్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు మోసిన్ బేగ్, బ్యాంక్ మేనేజర్ లక్ష్మీనారాయణ శాస్త్రి, డీలర్ హనుమంతు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రమీలరాణి, ఫ్యాక్ట్ కంపెనీ నిర్వాహకులు నీలిమా, కారోబార్ సాజిత్, హెచ్‌ఈవో కరిపే రవీందర్ ఆరోగ్య కార్యకర్తలు జానకి, రాణి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశలు, మహిళలు పాల్గొన్నారు.



పథకాలను వివరిస్తున్న దృశ్యం

శానిటేషన్ కార్మికులకు
కనీస వేతనం రూ.15,600 ఇవ్వాలి

• ఏఐటీయూసీ జాతీయ కౌన్సిల్ సభ్యులు వి.ఎస్.బోసు

నవతెలంగాణ-కామారెడ్డి

శానిటేషన్ కార్మికులకు 60వ జీవో ప్రకారం కనీస వేతనం రూ.15600 ఇవ్వాలని ఏఐటీయూసీ జాతీయ కౌన్సిల్ సభ్యులు వి.ఎస్.బోసు అన్నారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్, పేషెంట్‌కేర్, శానిటేషన్ కార్మికులకు వేతనం పెంచాలన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ సర్దుబాటుగా గతంలో ఉన్న కాంట్రాక్టర్లు ఆస్పత్రిలో ఏవన్ చెందినటువంటి కాంట్రాక్టర్ రూ.11వేల ఇస్తున్నట్టు తెలిపారు. ఎల్లారెడ్డి, బాన్సువాడ, దోమకొండ, బిచ్కుంద, మద్నూర్, గాంధారి, పిట్లం లాంటి చిన్న ఆసుపత్రిలో ఇష్టారాజ్యంగా కార్మికులను శ్రమ దోపిడీ చేస్తున్న కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. కార్మికులకు పనిభారం ఉన్నా వేతనాలు ఇవ్వడం లేదని అన్నారు. మూడు నెలల వేతనం గత ఒప్పందానికి వెయ్యి రూపాయలు పెంచాలని రాష్ట్ర నాయకత్వం కాంట్రాక్టర్లతో ఒప్పందం జరిగినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ సీనియర్ నాయకులు, ప్రముఖ న్యాయవాది వి.ఎల్.నరసింహారెడ్డి, మెడికల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎల్.దశరథ్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు పి.బాలరాజు, జిల్లా కార్యదర్శి ఎస్.ఆర్.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వి.ఎస్.బోసు

మహారాణా రక్తదాన్ సమూహ్ పురస్కారం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి వాసికీ జై మహారాణా రక్తదాన్ సమూహ్ పురస్కారం లభించింది. కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలుకు మధ్యప్రదేశ్‌కు చెందిన జై మహారాణా రక్తదాన్ సమూహ్ భారత్ సంస్థ అధ్యక్షులు రక్తమిత్ర శైలు మండోలి తలసేమియా చిన్నారుల కోసం చేస్తున్న రక్తదాన సేవలు, ఆపదలో ఉన్నవారికి సకాలంలో రక్తాన్నందించడం 200లకు పైగా రక్తదాన శిబిరాలను నిర్వహించడం, 16 సంవత్సరాల నుంచి రక్తదానంలో చేస్తున్న సేవలను గుర్తించి ప్రశంస పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ.. రక్తదానానికి సహకరిస్తున్న రక్తదాతలకు, పత్రిక విలేకరులకు, ప్రశంసా పత్రాన్ని అందజేసిన శైలు మండోలికి కృతజ్ఞతలు తెలియజేశారు.

గ్రంథాలయాల్లో మౌలిక వసతులు కల్పించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న ప్రేమ్‌లాల్

గ్రంథాలయాల్లో మౌలిక వసతులు కల్పించాలని తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షులు ప్రేమ్‌లాల్ అన్నారు. నగరంలోని వినాయక్ నగర్‌లోగల తెలంగాణ రచయితల వేదిక సంఘంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక గ్రామాల్లో ఎంతో మంది నిరుద్యోగులు చదువుకోసం గ్రంథాలయాలకు వెళ్తున్నారన్నారు. అయినా గ్రంథాలయాలు తెరుచుకోకుండా గ్రంథాలయాల్లో సరైన మౌలిక సదుపాయాలు లేక పుస్తక పాఠకులు, నిరుద్యోగులు రకరకాల ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. గ్రంథాలయాల్లో కనీస వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మణ్, అనిత, తదితరులు పాల్గొన్నారు.

నవ్యభారతిలో సపోస్ క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని నవ్యభారతి గ్లోబల్ స్కూల్‌లో ఆదివారం సపోస్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించంచారు. చిన్నారులు సాంటా క్లాస్ వేశాదరణలో అలరించారు. కార్యక్రమంలో యాజమాన్యం విద్యార్థులు పాల్గొన్నారు.



మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-బాల్కొండ

భార్య కాపురానికి రావడంలేదని మనస్థాపానికి గురై ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు. బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసకుంది. ఏఎస్ఐ శంకర్ వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని పోచమ్మ గల్లికి చెందిన తూమ్ నడిపి పోశెట్టి(42) పది సంవత్సరాల క్రితం పెర్కిట్ గ్రామానికి చెంది న లతతో వివాహం జరిగింది. మూడు సంవత్సరాల క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరిగి, భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో మనస్థాపానికి గురై జీవితం మీద విరక్తి చెంది తన భార్య కాపురానికి రావటం లేదని మానసిక బాధతో శనివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని అన్న తూము పెద్ద పోశెట్టి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏఎస్సై శంకర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి పిల్లలు సైతం లేరు.

బంజారా శక్తి మూమెంట్ నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలో "బంజారా శక్తి మూమెంట్" ఆధ్వర్యంలో సమాజ అబివృద్ధిలో యువకుల పాత్ర అనే అంశంపై సమావేశం జరిగింది. కార్యక్రమంలో యువకులు మాట్లాడుతూ..వారి అభిప్రాయాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బంజారా శక్తి మూమెంట్ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు మాలావత్ రవి నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మాలావత్ సంతోష్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ నాయక్ హాజరయ్యారు. వీరి ఆధ్వర్యంలో సిరికొండ మండల కొత్త బాడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ప్రసిడెంట్గఆ భూక్య బద్రి నాయక్, మండల జనరల్ సెక్రెటరీగా భూక్య సుమన్ నాయక్, మండల ట్రెజరర్‌గా గంగాధర్ నాయక్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా నగేష్ నాయక్, వైస్ ప్రెసిడెంట్‌గా గోవింద నాయక్, కళ్యాణ్, భూపతి, రాజేందర్ మొదలగువారిని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులు రవి నాయక్ మాట్లాడుతూ..సమాజానికి తిరిగి చెల్లించడంలో భాగంగా తమ జ్ఞానాన్ని, కాలాన్ని, ధనాన్ని సమాజ శ్రేయస్సు కోసం వెచ్చించాలని, మెరుగైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. తండాలలోని బాలబాలికలందరూ తప్పకుండా విద్యను అభ్యసించాలని కోరారు. బంజారా శక్తి మూమెంట్ ద్వారా యువకులు బాగా రాణించాలని కోరారు.

పట్టణంలో స్వచ్ఛ కాలనీ, సమైక్య కాలనీ



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో 26వ ఆదివారం స్వచ్ఛ కాలనీ, సమైక్య కాలనీ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, కాలనీ వాసులు కలిసి రెండు గంటల పాటు శ్రమించి కాలనీలోని పిల్లల పార్కును శుభ్రం చేశారు, పార్కులోని చెట్ల కొమ్మలను కట్టర్ తో కత్తిరించారు. ముళ్ల పొదలను, పిచ్చి మొక్కలను తొలగించారు. పారలతో మట్టిని ఎత్తి ఒక పక్కన వేశారు. స్వచ్చతలో తాము సైతం అంటూ చిన్నారి పిల్లలు కూడ శ్రమదాన కార్యక్రమంలో పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా జర్నలిస్ట్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు గోసికొండ అశోక్ మాట్లాడుతూ కరోనా మహమ్మారి మళ్ళీ ప్రబలుతున్న దృష్ట్యా కాలనీవాసులు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమంలో పాల్గొంటున్న కాలనీ వాసులకు. పురపాలక సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. హనుమాన్ ఆలయ కమిటీ అధ్యక్షుడు శివరాజ్ కుమార్, అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి బి.కమలాకర్, ఉపాధ్యక్షులు సుంకే శ్రీనివాస్, కొక్కెర భూమన్న, కార్యదర్శులు కొంతం రాజు, సాయన్న, ఆలయ కమిటీ కోశాధికారి ఎర్ర భూమయ్య, ఎస్సారెస్పి డీఈ గణేష్, టోనా, వరలక్ష్మి, భాజన్న, పురపాలక ఉద్యోగి వెన్న మోహన్, హరితహారం సిబ్బంది పాల్గొన్నారు.

స్టేట్ లెవెల్ తైక్వాండోలో సత్తా చాటిన అక్షర



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఈ నెల 23న వికారాబాద్ జిల్లా తాండూర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్ 68 వెయిట్ కేటగిరిలో నిజామాబాద్ తైక్వాండో క్రీడాకారిణి అక్షర సత్తా చాటినట్లు ఆదివారం తెలిపారు. వికారాబాద్ తాండూర్ డిస్ట్రిక్ట్‌లో ఈ నెల 31న మధ్య ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి ఛాంపియన్ షిప్‌కు ఎంపికయింది. ఈ సందర్భంగా నిజామాబాద్ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మనోజ్ కుమార్ క్రీడాకారిణిని అభినంచారు. ఈనెల 23 న ఎస్జిఎఫ్ స్టేట్ లెవెల్ ఛాంపియన్షిప్ 68 కేటగిరిలో అక్షర శ్రీనిధి సాధించింది. ఈనెల 31న మధ్యప్రదేశ్‌లో జరిగే నేషనల్ ఛాంపియన్ షిప్‌కు ఎంపికయిందని నిజామాబాద్ జనరల్ సెక్రటరీ మనోజ్ కుమార్ తెలిపారు. అక్షర జిల్లాస్థాయి ఎస్జీఎఫ్ తైక్వాండోలో గోల్డ్ మెడల్, రాష్ట్ర స్థాయి తైక్వాండో క్రీడల్లో గోల్డ్ మెడల్ సాధించి నిజామాబాద్ ఖ్యాతిని చాటిందని, భవిష్యత్తులో జాతీయ స్థాయిలోనూ అక్షర గెలిచి తీరుతుందని ఆయన ఆశభావం వ్యక్తం చేశారు.

గంగపుత్ర ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మాడవేడి వినోద్ కుమార్

నవతెలంగాణ-కంఠేశ్వర్



గంగపుత్ర ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మాడవేడి వినోద్ కుమార్‌ను ఎన్నుకున్నారు. ఆదివారం హైదరాబాద్ తార్నక లోని సత్యోదయం హాల్‌లో జరిగిన గంగపుత్ర ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వివిధ జిల్లాల ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రధాన కార్యదర్శిగా పది సంవత్సరాలుగా జిల్లా అధ్యక్షులుగా ఉన్న నిజామాబాద్ జిల్లాకు చెందిన మాడవేడి వినోద్ కుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు డా. రచ్చ రఘు, డా. రాజన్న అడ్వకేట్ పూస మల్లేష్, పాక శంకర్, అశోక్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

బహుమతి.. బహు రూపం

- ఆకట్టుకుంటున్న క్రిస్మస్ బహుమతులు
- ప్రార్థనల కోసం చర్చిల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- క్రిస్మస్ పండుగకు ముస్తాబైన చర్చిలు
- నేడు క్రిస్మస్ పండగ



కంఠేశ్వర్.. ముస్తాబైన సిఎస్ఐ చర్చి

నవతెలంగాణ-ఆర్మూర్

క్రిస్మస్ అంటే రెండు పదాల కలయికతో ఏర్పడింది ఆంగ్లంలో క్రైస్తు ఒమాస్ అనే పదాలతో ఈ పండగను పిలుస్తారు. నేడు క్రిస్మస్ వేడుకలకు ఉమ్మడి జిల్లాలలోని చర్చిలు ప్రార్థన మందిరాలు ముస్తాబయ్యాయి. క్రైస్తవుల కళ్ళల్లో మెరుపు కనిపిస్తూ వారి గుండెల నిండా ఆరాధన భావం వెలివేస్తే సంబరమైన రోజు నేడు... ఈ సందర్భంగా నవ తెలంగాణ కథనం...

ఉమ్మడి జిల్లాల్లో ముస్తాబైన చర్చిలు...

క్రైస్తవులు అత్యంత పవిత్రంగా భావించే క్రిస్మస్ సంబరాలకు ఉమ్మడి జిల్లాలోని చర్చిలు ముస్తా అయ్యాయి. జిల్లా కేంద్రంలోని అత్యంత పురాతన సిఎస్ఐ చర్చితోపాటు ఆయా కాలనీలోని చర్చిలు డిచ్పల్లి ధర్మారం చర్చి, బోధన్, కామారెడ్డి, ఆర్మూర్ తదితర ప్రాంతాలలోని చర్చిలలో క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరుపుకుంటారు. ఇప్పటికే వివిధ చర్చిల నిర్వహణ కమిటీలు, క్రైస్తవ సంఘాలు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు భారీ ఎత్తున సన్నాహాలు చేశారు. చర్చిలను ఆకర్షణీయమైన రంగులతో విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించినందుకు ఏర్పాటు చేశారు. మరికొన్ని చర్చిల్లో ఏసుక్రీస్తు జన్మించిన పశువుల పాకల సెట్టింగ్లతోపాటు మేరీమాత, జీసస్ విగ్రహాలను ఏర్పాటు చేశారు. టీచర్స్ కాలనీలోగల చర్చితో పాటు పలుచోట్ల చర్చిలలో క్రిస్మస్ సంబరాలు నేడు నిర్వహిస్తున్నారు.

కంఠేశ్వర్: క్రిస్మస్ పండుగకోసం నెల రోజుల ముందు నుంచే చర్చీలు రంగులద్దుకున్నాయి. చిన్నారులకు, ఆడుకునే పాపాయిలకు, సందడి చేసే మగువలకు, సంబరాలు చేసుకునే యువతకు క్రిస్మస్ తాతయ్య బోలెడన్ని బహుమతులను అందివ్వనున్నాడు. క్రైస్తవులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో క్రిస్మస్ అలంకరణలు వెలుగులు విరజిమ్ముతున్నాయి. చర్చీలన్నీ రంగురంగుల దీపాలతో ముస్తాబయ్యాయి. స్టార్లు, క్రీబ్లుక్రిస్మస్ ట్రీ, శాంతాక్లాజ్ మాస్కులతో చర్చిలవద్ద సందడినెలకొంది.

జిల్లాలోని చర్చిలన్నీ రంగురంగుల దీపాలంకరణలతో ముస్తాబయ్యాయి. ఏసుక్రీస్తు పుట్టిన రోజును పురస్కరించుకుని జరుపుకునే పండగ కాబట్టి ఆయన పుట్టిన సమయంలో జరిగిన ఘటనల ఆధారంగా కొన్ని అలంకార వస్తువులు తయారు చేస్తుంటారు. వీటిలో ముఖ్యమైనవి స్టార్, క్రిబ్ క్రిస్మస్ ట్రీ.. వీటిని ఇళ్లల్లో విద్యుత్తు దీపాలతో అలంకరించుకోవడం ఆనవాయితీగా వస్తుంది.. ప్రతి ఇంట్లో పశువుల పాక ఏర్పాటు చేసి. అందులో క్రిబ్ పెట్టి బాల ఏసును పడుకోబెట్టి ప్రార్థనలు చేస్తారు. ఇలా క్రిస్మస్ ఆరంభానికి పదిహేను రోజుల ముందు నుంచే ఈ తంతు చేస్తుంటారు.. ఇటలీ, జెరుసలేం.. యూరోపియన్ దేశాల్లో ప్రతి ఇంట్లో డిసెంబర్ నెలంతా ఇలాంటి అలంకరణలు చేసి ప్రార్థనలు చేస్తారు. ఈ సంప్రదాయం మన దగ్గర కూడా ప్రారంభమయింది.

ఇళ్లపైన ఏర్పాటుచేసుకునే స్టార్ ఏసు జన్మించినప్పుడు ఆకాశంలో ఒక తారమెరిసిందని క్రైస్తవ గ్రంథాలు చెబుతున్నాయి. కాబట్టి క్రిస్మస్ ను పురస్కరించుకుని ఇళ్లపై స్టార్‌ను ఏర్పాటు చేస్తుంటారు. ఇందులోవిద్యుత్తు బల్బును ఉంచడం వల్ల రాత్రి వేళలో కాంతివంతంగా,

ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ఇలాంటి స్టార్ల ధర ఎక్కువగా ఉండటంతో ప్రస్తుతం కాగితపు స్టార్లను వాడుతున్నారు.





కంఠేశ్వర్.. పశువుల పాక

బహుమతుల బాక్సులు..

ఆర్థికంగా ఉన్న వారు ఇళ్లల్లో క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేసి దానికి బహుమతుల బాక్సులను కడుతుంటారు. ఇంటికి పిలిచిన అతిథులకు

ట్రీకి ఉన్న బాక్సులను తెరిచి. అందులోని బహుమతులను అందజేస్తూ ఉంటారు. ఈ సంప్రదాయం ఇటీవల కాలంలో ఎక్కువైంది.

శాంతాక్లాజ్ మాస్కులు...

ఈ పండగ వచ్చిందంటే చాలు

క్రిస్మస్ తాతయ్య వచ్చి బహుమతులను ఇస్తారని పిల్లలు అనుకుంటారు.. చాలా మందిశాంతాక్లాజ్ మాస్కులు దుస్తులుధరించి బహుమతులను పంచిపెడతారు.. అలాంటి వా రికోసం రెడీమేడ్ దుస్తులు, మాస్కులు మార్కెట్లో లభిస్తున్నాయి.. గతంలో తాతయ్య వేషంవేసుకోవడానికి నానా తంటాలు పడేవారని, అప్పుడు మాస్కులు ధరిస్తే సరిపోతోందని పలువురు క్రిస్టియన్లు చెబుతున్నారు.

కొవ్వొత్తులు వెలిగిస్తూ...

ఆదివారం అర్ధరాత్రి వరకు జాగరణ రాత్రి పాటిస్తారు.. ప్రపంచం అంధకారంలో ఉందని ఏసుప్రభు ఆ చీకటిని దూరం చేసేందుకు జన్మించారని చాటేలా ప్రత్యేకంగా కొవ్వొత్తులను వెలిగిస్తారు. చిమ్మ చీకటిలో చర్చిలో కొవ్వొత్తులను వెలిగించి 8 బైబిల్ సూక్తులు, తొమ్మిది పాటలను ఆలపిస్తూ క్రైస్తవ సోదరులు జాగరణలో పాల్గొంటారు.



ప్రధాన పండుగగా...

చారిత్రక వేత్తల సమాచారం మేరకు క్రీస్తుశకం 336లో ప్రథమంగా క్రిస్మస్‌ను డిసెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా జరుపుకున్నారని మతగురువులు తెలుపుతున్నారు. మానవజాతిని రక్షించేందుకు దేవుడు యేసు క్రీస్తు రూపంలో జన్మించాడని విశ్వసిస్తూ ఈ పర్వదినాన్ని నిర్వహిస్తున్నారు. 1100 సంవత్సరం నుండి యూరప్‌లో క్రిస్మస్ ప్రధాన పండుగగా చేసుకోవడం విశేషం..

క్రిస్మస్ తాత....



క్రిస్మస్ రోజు చిన్నారులతో క్రిస్మస్ తాత వచ్చి సరదాగా ఆడుకుంటాడని వారికి బోలెడు బొమ్మలు, చాక్లెట్లు ఇస్తాడని చిన్నారులు అతని కోసం ఆశగా ఎదురు చూస్తుంటారు. నిజానికి రాత్రిళ్ళు చిన్నారులు నిద్రపోగానే వారి పక్కన గిఫ్టులు ఇచ్చి వెళుతుంటాడు. తర్వాత సంబరాల్లో వారొక చక్కని డ్రెస్సు, తెల్లటి గడ్డం పెట్టుకొని చిన్న పెద్ద అందరిని అలరిస్తాడు క్రిస్మస్ తాత...

గంటల బొమ్మలు...

ఏసు జన్మించినప్పుడు ఆకాశం నుంచి గంట శబ్దాలు వినిపించాయని క్రైస్తవులు చెబుతుంటారు. కాబట్టే ఇళ్లను అలంకరించుకోవడంలో గంటల బొమ్మలను తప్పనిసరిగా వినియోగిస్తున్నారు. గంటలనుగుమ్మాలకు కడుతుంటారు క్రీట్‌ను ఏర్పాటు చేసి దానికి కూడా వేలాడదీస్తారు.

క్రిస్మస్ ట్రీ... క్రిస్మస్ స్టార్...

ప్రకృతిని కూడా ఆరాధించేలా క్రిస్మస్ పండగ రూపుదిద్దుకుంటుంది ప్రధానంగా క్రిస్మస్ ట్రీగా వ్యవహరించే చెట్లను అందంగా అలంకరిస్తారు. పూర్వం ఓకు చెట్లను పూజించేవారు. క్రిస్మస్ చెట్లను ప్యారడైజ్ ట్రీగా కూడా వ్యవహరిస్తారు. ప్రతి నిత్యం పచ్చగా ఉంటూ ప్రజలను సంతోషంగా సుఖంగా ఉంచుతుందని విశ్వసిస్తారు. ఈ చెట్లకు ఎర్రని ఆపిల్ పళ్లను ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలు నక్షత్రాలతో అలంకరించే ఆనవాయితీ నేటికీ క్రిస్మస్ రోజుల్లో కొనసాగుతోంది క్రిస్మస్‌కు ప్రారంభం ముందు నుంచే క్రైస్తవులు తమ ఇళ్లపై నక్షత్ర ఆకృతులను అలంకరించుకుంటారు. క్రీస్తు రాకను కాంక్షిస్తూ క్రైస్తవ ప్రార్థన మందిరాలు ఇళ్లపై అలంకరించటం ఒక సాంప్రదాయంగా నేటికీ కొనసాగుతుంది.



క్రిస్మస్ శుభాకాంక్షలు : కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. యేసుక్రీస్తు జన్మించిన ఈ శుభ దినాన అందరికీ శాంతి, సౌభాగ్యాలు చేకూరాలని ఆకాంక్షించారు. ఈ క్రిస్మస్ వేడుక ప్రతి ఒక్కరి జీవితంలో సంతోషం నింపాలని, ఇంటింటా ఆనందపు కాంతులు వెల్లివిరియాలని, అన్ని రంగాల్లో నిజామాబాద్ జిల్లా మరింత ప్రగతి సాధించాలని అభిలషించారు.

క్రిస్మస్ పండగ శుభాకాంక్షలు

కంఠేశ్వర్: నిజామాబాద్ పోలీస్ కమిషనరేటు పరిధిలోని ప్రజలందరికి డిసెంబర్ 25న జీసస్ క్రీస్తు జన్మదినం క్రిస్మస్ పండుగా సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, నిజామాబాద్ అదనపు కమిషనర్ లా అండ్ ఆర్డర్ జయరాం ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంవత్సర కాలంలో ప్రజలందరు వారి కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో కాలం గడపాలన్నారు. ఈర్ష్య, ద్వేషం, అసూయలతో కూడిన చీకట్లను పారద్రోలి ప్రేమ అనే దీపం వెలిగించి పది మందికి వెలుతురును ఇవ్వాలని అన్నారు. ఎల్లప్పుడు ప్రజలు, పోలీస్ సిబ్బంది స్నేహ పూర్వకంగా సోదర భావంతో మెలగాలని నిజామాబాద్ అదనపు కమిషనర్ తెలిపారు.

సమావేశంలో కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్లు, కమిషనర్లు

నవతెలంగాణ-కంఠేశ్వర్



హైదరాబాద్‌లోని డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర ముఖ్య మంత్రి ఏ.రేవంత్‌రెడ్డి ఆదివారం నిర్వహించిన సమావేశంలో నిజామాబాద్ కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో పాల్గొన్నారు. నిజామాబాద్ జిల్లా పాలనాధికారి రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే బీజేపీ లక్ష్యం

- అర్బన్ శాసనసభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

అన్ని వర్గాల సంక్షేమమే బిజెపి పార్టీ లక్ష్యం అని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ఆదివారం నిజామాబాద్ నగరం లోని అంబేద్కర్ భవన్‌లో మైనార్టీ శాఖ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అర్బన్ శాసనసభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ హాజర య్యారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణ మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షమామే బీజేపీ లక్ష్యం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి యేటా క్రిస్మస్ వేడుకల సందర్భంగా చీరలను పంపిణి చేయడం జరుగుతుందని తెలిపారు. నగరంలోని క్రిస్టియన్ సోదరిమనులకు చీరలను అందించామన్నారు. సబ్‌కాసాత్ సబ్‌కా వికాస్ సబ్‌కా ప్రయాస్ బీజేపీ నినాదమని అన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం కుల, మతాలకు అతీతంగా అభివృధి చేస్తుందని తెలిపారు. నగరంలో 24 సంవత్సరాలనుండి తన ట్రస్ట్ ద్వారా అన్ని వర్గాల ప్రజలకు సేవ చేస్తున్నట్టు చెప్పారు. అందరం కలసి కట్టుగా నగరాన్ని అభివృద్ధి చేసుకుందామని అన్నారు. కార్యక్రమంలో మైనార్టీ అధికారి కృష్ణవేణి, డేవిడ్, జోసెఫ్ క్రిస్టియన్ సోదర, సోదరీమణులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

అందరికీ విద్య, ఉపాధి హక్కుకోసం 12న జరిగే చలో ఢిల్లీని విజయవంతం చేయాలి

- ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-కంఠేశ్వర్

అందరికీ విద్య, ఉపాధి హక్కుకోసం జనవరి 12న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. ఆదివారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిజామాబాద్ నగర ఆఫీస్ బెరర్స్ సమావేశం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు జిల్లా అధ్యక్షులు రాచకొండ విఘ్నేష్ హాజరై మాట్లాడారు. పది సంవత్సరాలుగా కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలకు లబ్ది చేకూర్చేలాగా విధివిధానాలు రూపొందిస్తున్నా రని అన్నారు. శాస్త్రీయ విద్యను తిరోగమనంలోకి నెట్టివేసే విధంగా ఉన్న నూతన జాతీయ విద్యా విధానం-2020 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలని, ఉన్నత విద్యకు అధిక నిధులు కేటాయించాలని అన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యాసంస్థల్లో మత పరమైన విషయాలపై చూపిస్తున్న శ్రద్ధ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి చూపకపోవడం సిగ్గు చేటని అన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి చేపట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయడానికి విద్యార్థులందరూ తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు విశాల్, పోషమైన మహేష్, నగర ఆఫీస్ బేరర్స్ దీపిక, గణేష్, వేణు గోపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రెంజల్‌లో అయ్యప్ప పడిపూజ



నవతెలంగాణ-రెంజల్
మండల కేంద్రంలో కృష్ణ స్వామి అయ్యప్ప పడిపూజను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గురుస్వామితోపాటు అయ్యప్ప మాలధరణ ధరించిన స్వాములు, గ్రామస్తులు, మహిళా స్వాములు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. అత్యంత వైభవంగా పడిపూజ నిర్వహించగా గురు స్వాములు ప్రత్యేక పూజలను నిర్వహించి స్వాములకు, గ్రామస్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మహిళలు చిన్నారులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి


మృతి చెందిన అశోక్

నవతెలంగాణ-ఎడపల్లి
ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై భూపల్లి విక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కొండల్‌వాడి అశోక్ (47) అనే వ్యక్తి ఆదివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో కల్లు తాగి ఇంటికి వచ్చాడు. బయటకు వెళ్తున్నానని చెప్పి.. చెరువుగట్టుకు బహిర్భుమికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడి నీటమునిగి మృతి చెందాడు. భార్య కొండలవాడి రాజమణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులతో ఉజ్వల భవిష్యత్తు

- టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులకు నోటిఫికేషన్ విడుదల
- డ్రాయింగ్, టైలరింగ్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు
- గురుకుల పాఠశాలలో, ప్రభుత్వ పాఠశాలలో ఉద్యోగావకాశాలు

నవతెలంగాణ-బోధన్
నేటి పోటీ ప్రపంచంలో ఎంత చదువుకున్న ఉద్యోగాలు రావడం కష్టంగా మారింది. దాంతో టెక్నికల్ కోర్సుల వైపు దృష్టి సారిస్తున్న విద్యార్థులు తమలోని నైపుణ్యంతో ఉపాధి మార్గాలను పొందుతున్నారు. ఇంజనీరింగ్, టెక్నికల్ కోర్సుల్లాగే ఆర్ట్, క్రాఫ్ట్ ఉపాధి కోర్సులతో ఎందరో దేశ, విదేశాలలో ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. అలాగే సృజనాత్మకతకు బాటలు వేసి టెక్నికల్ కోర్సులు విద్యార్థుల జీవితాలకు ఉజ్వల భవిష్యత్తునిస్తున్నాయి.

పాఠశాల స్థాయిలో విద్యార్థులకు సృజనాత్మక విద్యను బోధించడానికి 2010 సంవత్సరం నుంచి ప్రభుత్వం ఆర్ట్, క్రాఫ్ట్ సహ పాఠ్యాంశాల బోధనకు పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్ల నియామకం చేపట్టింది. అలాగే ఈ కోర్సులలో నైపుణ్యం సాధించిన వారు బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్‌లో ప్రవేశం పొంది ఉపాధి మార్గాలను ఎంచుకోవచ్చు. ఈ సంవత్సరం గురుకుల పాఠశాలలో ఆర్ట్, క్రాఫ్ట్ టీచర్ల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దాంతో భవిష్యత్తులో కూడా ఈ పోస్టులకు డిమాండ్ ఏర్పడే అవకాశం ఉంది. ఈ సృజనాత్మక కోర్సులలో విద్యార్థులను ఉద్యోగాల వైపు ఆకర్షించడానికి ప్రభుత్వం ప్రతి సంవత్సరం టెక్నికల్ కోర్స్ సర్టిఫికెట్ పరీక్షలను నిర్వహిస్తుంది. అందులో భాగంగా ప్రస్తుతం టీసీసీ పరీక్షలైన డ్రాయింగ్, టైలరింగ్ లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేసింది. కనీసం ఏడో తరగతి పాస్ అయిన వారు లోయర్ గ్రేడ్ పరీక్షలు రాయడానికి, పదవ తరగతి పరీక్షలు పాస్ అయిన వారు హయ్యర్ గ్రేడ్ పరీక్షలు రాయడానికి అర్హులు. ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవడానికి డిసెంబర్ 29 చివరి తేదీగా అధికారులు ప్రకటించారు. సృజనాత్మకత నైపుణ్యం ఉన్న వారికి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులు ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలకనున్నాయి. ఆసక్తి గలవారు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలి. ఫిబ్రవరి 11వ తేదీ నుండి పరీక్షల నిర్వహణ చేపడుతున్నట్లు అధికారులు వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు.

బొమ్మలు గీసే అలవాటుతో డ్రాయింగ్ పరీక్ష పాసయ్యా



తనకు చిన్నప్పటి నుంచి బొమ్మలు గీయడం ఇష్టం ఉండడంతో సొంతంగా బొమ్మలు గీయడం ప్రాక్టీస్ చేస్తూ గత సంవత్సరం డ్రాయింగ్ లోయర్ పరీక్ష రాసి పాసయ్యాను. ప్రస్తుతం డ్రాయింగ్ హైయర్ పరీక్ష రాయడానికి సిద్ధమవుతున్నా. డ్రాయింగ్ కోర్స్‌తో భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉంది. దాంతో డిగ్రీ చదువుతూనే డ్రాయింగ్ పరీక్షలు రాయడానికి సిద్ధమవుతున్నా.
- అవంతి, డిగ్రీ విద్యార్థిని బోధన్.

టెక్నికల్ కోర్సులు భవిష్యత్తుకు బాటలు



ప్రభుత్వం ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులు డ్రాయింగ్, టైలరింగ్ ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసే అవకాశం ఉంది. ఆర్ట్, క్రాఫ్ట్ కోర్సులు పాస్ అయిన వారికి ఈ సంవత్సరం ప్రభుత్వం గురుకుల పాఠశాలలో ఉద్యోగాలు కల్పనకు అవకాశాలు కల్పించింది. అలాగే గత కొన్ని సంవత్సరాలు క్రితం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సహ పాఠ్యాంశాల బోధనకు పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్ ఉద్యోగాలను భర్తీ చేసింది. దాంతో ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు వచ్చే అవకాశం ఉంది.
- లక్ష్మణ్, డ్రాయింగ్ ఇన్‌స్ట్రక్టర్ బోధన్.

ఇవే పరీక్షల అంశాలు..
ప్రభుత్వం ఫిబ్రవరిలో నిర్వహిస్తున్న టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులు డ్రాయింగ్, టైలరింగ్ గ్రేడులకు సంబంధించి లోయర్ గ్రేడ్‌లో డ్రాయింగ్ ఫ్రమ్‌ప్లాట్ ఎగ్జాంపుల్, మోడల్ డ్రాయింగ్, మెమొరీ డ్రాయింగ్, పెయింటింగ్ ఫ్రం నేచర్, స్టిల్ లైఫ్ పెయింటింగ్, జామెట్రికల్ డ్రాయింగ్, ప్యాటర్న్ డిజైన్ అలాగే డ్రాయింగ్ హయ్యర్ గ్రేడ్‌లో ఫ్రీ హ్యాండ్ డ్రాయింగ్, ఆబ్జెక్టివ్ డ్రాయింగ్, మెమొరీ డ్రాయింగ్ (కలర్స్)తో వేయాలి, పెయింటింగ్ ఫ్రమ్ నేచర్, స్టిల్ లైఫ్ పెయింటింగ్, ప్యాటర్న్ డిజైన్ (కలర్స్)తో, జామెట్రికల్ డ్రాయింగ్, పర్స్పెక్టివ్ డ్రాయింగ్ పేపర్లు ఉంటాయి. అలాగే టైలరింగ్ విభాగంలో లోయర్ గ్రేడ్ పరీక్షలో టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ, హయ్యర్ గ్రేడ్ పరీక్షలో డ్రాఫ్టింగ్ అండ్ గార్మెంట్ మేకింగ్ పేపర్లు ఉంటాయి. వీటిలో లెగ్ మేకింగ్, బాడీ గార్మెంట్, డ్రాఫ్టింగ్, కటింగ్ అండ్ ఎంబ్రాయిడరీ అంశాలపై పరీక్షలు నిర్వహిస్తున్నట్లు



అధికారులు పేర్కొన్నారు. డ్రాయింగ్ వారికి 8 పేపర్లు రోజుకు రెండు పేపర్లు చొప్పున నాలుగు రోజులు పరీక్షలు నిర్వహిస్తారు. టైలరింగ్ వారికి రెండు పేపర్లు ఒకరోజు పరీక్ష నిర్వహిస్తుంటారు. టైలరింగ్ పరీక్షలు రాసేవారు కుట్టుమిషన్లను తీసుకువెళ్లవలసి ఉంటుంది. ఆసక్తిగల వారు దరఖాస్తులు చేసుకున్న వారు ముందుగా ఆయా కోర్సులలో నిష్ణాతులైన అధ్యాపకుల వద్ద శిక్షణ పొంది పరీక్షలకు సిద్ధమైతే తప్పనిసరిగా ఉత్తీర్ణులయ్యే అవకాశం ఉంది. ఈ పరీక్షలలో ఏ ఒక్క పేపర్‌తో ఫెయిల్ అయిన తిరిగి అన్ని పేపర్లు రాయవలసి ఉంటుంది. కావున అభ్యర్థులు ముందుగా శిక్షణ తీసుకుని పరీక్షలు సిద్ధమైతే ఫలితం ఉంటుంది. బోధన్ పట్టణంలో తేజ డ్రాయింగ్ ఇన్స్టిట్యూట్, కామారెడ్డిలో ప్రసాద్ డ్రాయింగ్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో అభ్యర్థులకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు డ్రాయింగ్ ఇన్‌స్ట్రక్టర్ లక్ష్మణ్ తెలిపారు.

వృద్ధుడు అదృశ్యం

- కేసు నమోదు



నవతెలంగాణ-ఎడపల్లి
వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మండలంలోని జానకంపేట్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై విక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రుక్మాయి నాగేశ్వర్ (71) అనే వృద్ధుడు మానసిక స్థితి బాగాలేదు. దీంతో అప్పుడప్పుడు రాత్రివేళలో బయటకు వెళ్లి.. తిరిగి వచ్చేవాడు. కాగా ఈనెల 18న తెల్లవారుజామున రుక్మాయి నాగేశ్వర్ ఆరు బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇండ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో నాగేశ్వర్ భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత



నవతెలంగాణ-తాడ్వాయి
తాడ్వాయి మండల పరిధిలోని వివిధ గ్రామాలలో దొంగిలించబడిన సెల్‌ఫోన్‌ను తాడువాయి ఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో పట్టుకున్నారు. నాలుగు సెల్‌ఫోన్‌లను పట్టుకొని బాధితులకు అందజేశారు. బాధితులు చేసిన ఫిర్యాదుల మేరకు విచారణ జరిపి సెల్ ఫోన్లను పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు.

గ్రామాల వారిగా ఈ కేవైసీ చేపడతాం

- భారత్ గ్యాస్ డీలర్ అంజాద్ హుస్సేన్



నవతెలంగాణ-లింగంపేట్
మండలంలోని ఆయా గ్రామాల వారీగా ఈ కేవైసీ నమోదు చేపడతామని లింగంపేట ఎస్ఎంపీ భారత్ గ్యాస్ గ్రామీణ్ వి ట్రాక్ డీలర్ అంజాద్ హుస్సేన్ అన్నారు. ఆదివారం భారత్ గ్యాస్ కార్యాలయంలో మాట్లాడారు. మండల కేంద్రంలోని భారత్ గ్యాస్ కార్యాలయం వద్ద ప్రజలు, మహిళలు ఇబ్బందులకు గురికాకుండా గ్రామాల వారిగా తేదీని నిర్ణయించి భారత్ గ్యాస్ కార్యాలయం వద్ద కరపత్రం అతికించినట్టు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు గ్రామాల వారిగా ఈ కేవైసీ నమోదు కార్యక్రమం చేపడుతున్నామన్నారు. వంటగ్యాస్ లబ్ధిదారులు తప్పకుండా ఈ కేవైసీ నమోదు చేయించుకోవాలని సూచించారు. రోజుకు 500 మందికి ఈ కేవైసీ చేయిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన 500 గ్యాస్ సిలిండర్‌కు ఈ కేవైసీ ఎలాంటి సంబంధం లేదన్నారు. ఈ విషయాన్ని అందరూ గమనించాలని, అపోహలను నమ్మవద్దని ఆయన సూచించారు. భారత్ గ్యాస్ నిర్వాహకులకు సహకరించాలని ఆయన కోరారు.

ముఖ్యమంత్రి సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎస్పీ



నవతెలంగాణ-కామారెడ్డి
డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగిన రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో నిర్వహించిన సమావేశంలో కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధు శర్మ పాల్గొన్నారు. జిల్లాలో జరిగే, జరిగిన అభివృద్ధి, శాంతి భద్రతల వివరాలను సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎస్పీలు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఆయా శాఖ మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్ర డీజీపీ రవిగుప్తా, ఆయా శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కామారెడ్డికి చేరిన అయోధ్య అక్షింతలు

- తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్షింతల శోభాయాత్ర

నవతెలంగాణ-కామారెడ్డి
అయోధ్య అక్షింతలు కామారెడ్డి నగరానికి వచ్చిన సందర్భంగా తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్షింతల కలశాలతో కామారెడ్డి నగర పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. ఈ యాత్ర ధర్మశాల నుంచి రైల్వే స్టేషన్, బాంబే క్లాత్, పాన్ చౌరస్తా, గర్ల్స్ హైస్కూల్, కోదూరి హనుమాన్ మందిర్, పెద్దబజార్ మీదుగా నిజాంసాగర్ చౌరస్తా చేరుకొని అక్కడి నుంచి సర్దార్ వల్లభాయ్ పటేల్ వీధి, జన్మభూమి రోడ్, కొత్త బస్టాండ్ నుంచి శ్రీ సరస్వతి విద్యామందిర్‌లో శాంతి మంత్రముతో ఈ యాత్రను ముగించారు. ధర్మశాల దగ్గర కామారెడ్డి


అక్షింతల శోభాయాత్ర

నియోజకవర్గం శాసనసభ్యులు వెంకటరమణా రెడ్డితో జ్యోతి వెలిగించి ప్రారంభించారు. జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు గంగారెడ్డి, కోశాధికారి నిత్యానందంలతో పాటు ఈ కార్యక్రమం నిర్వాహణను జిల్లా కార్యదర్శి బొల్లి రాజు పర్యవేక్షించారు. అక్షింతలు 700 గ్రామాలకు కలశాలలో తయారు చేసి ఇచ్చామని, ఈ కార్యక్రమంలో మధ్యమధ్య హారతులతో రామభక్తులు శ్రద్ధా భక్తులను ప్రసాదించారు. కార్యక్రమంలో శ్రీ రామలింగా రెడ్డి, నగర అధ్యక్షులు ధనుంజయ్, విశేష సంపర్క ప్రముఖ వెంకటస్వామి, పాపారావు, వంగప్రసాద్, మంచాల రాజు (బజరంగ్దళ్ జిల్లా సంయోజక్) అనిల్, భాగ్యలక్ష్మి, వరలక్ష్మి జ్యోతి, రాణి తదితరులు పాల్గొన్నారు.

క్లాసికల్ స్వైన్ ఫీవర్ పెంపకం దారులు జాగ్రత్తగా ఉండాలి

- జిల్లా పశు వైద్యాధికారి డా.కె.సింహారావ్



నవతెలంగాణ-కామారెడ్డి
పందుల పెంపకం దారులు క్లాసికల్ స్వైన్ ఫీవర్‌పై జాగ్రత్తగా ఉండాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ కె.సింహారావు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఈ వ్యాధి సూక్ష్మాతి సూక్ష్మ జీవులైన సిఎస్ఎఫ్‌వి వైరస్ వలన వస్తుందన్నారు. ఈ వ్యాధి (లోకల్ జాతి, అడవి జాతి) పందులలో వస్తుందని తెలిపారు. ఈ వ్యాధి వలన పందుల పెంపకందారులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతారన్నారు. ఈ సందర్భంగా వ్యాధి లక్షణాలు, వాటి నివారణ చర్యల గురించి జిల్లా పశువైద్యాధికారి వివరించారు.

వ్యాధి లక్షణాలు..
ఈ వ్యాధి వచ్చినప్పుడు పందులలో జ్వరం చాలా తీవ్రంగా ఉంటుంది. పందులలో అంతర్గత రక్తస్రావం జరుగుతుంది. (ఈ లక్షణం మనకు పందుల చర్మ భాగంలో చూస్తే అంతర్గత రక్త స్రావం కనిపిస్తుంది. కంటి శ్లేష్మ భాగం (మ్యూకస్ మెంబ్రయిన్) ఎర్రగా అవుతుంది. శ్వాస కష్టంగా తీసుకుంటుంది. నరాల బలహీనత కలగడం వలన కొన్ని సార్లు సరిగ్గా నడవలేకపోతుంది. పక్షవాతం వచ్చే అవకాశం ఉంది. ఆకలి మందగిస్తుంది. ఆహారాన్ని తక్కువగా తీసుకుంటుంది. పందులలో మొదట పసుపు వర్ణంలో పలుచగా అతిసారం విరోచనాలు తర్వాత మలబద్ధకం కలుగుతుంది. వాంతులు అవుతాయి. చెవులు, చర్మం, ఊదారంగులోకి మారుతాయి. ప్రత్యుత్పత్తి వ్యవస్థ సరిగ్గా పనిచేయదు.

నివారణ చర్యలు..
నివారణ చర్యలలో అతి ముఖ్యమైనది (చికిత్స కంటే నివారణ మేలు) సిఎస్ఎఫ్ వ్యాక్సిన్ తీసుకోవటం. ప్రతీ సంవత్సరం తప్పకుండా టీకాలు వేయించాలి.

తీసుకోవాల్సిన జాగ్రతలు..
బయో సెక్యూరిటీ పద్ధతులు పాటించాలి. వ్యాధి వచ్చిన పందులను వేరు చేయాలి. వాటికి ప్రత్యేక చికిత్స చేయాలనీ, కలుషిత ఆహారం, నీటిని ఇతర పందులకు అందించవద్దు.

సీఎస్ఎఫ్ వ్యాక్సిన్ వేయించాలి..



కామారెడ్డి జిల్లాలో ఉన్న పందుల పెంపకదారులు తమ పందులకు సిఎస్ఎఫ్ వ్యాక్సిన్ వేయించాలి. తద్వారా సురక్షితంగా పెంచుకొని, ఆర్థిక లాభాలను పొందాలి. శనివారం గర్గుల్, తలమడ్ల, జుక్కల్ బాన్సువాడ, బిచ్కుంద, ముత్యంపేట, అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామాలలో సిఎస్ఎఫ్ వ్యాక్సిన్ వేశాం.
జిల్లా పశువైద్య అధికారి డా.కే.సింహారావ్



క్రిస్‌మస్ వేడుకలకు ముస్తాబైన చర్చి

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్
క్రిస్టమస్ పండగను పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో ఉన్న చర్చిలు అందంగా ముస్తాబయ్యాయి.. సోమవారం క్రిస్‌మస్ పండుగను పురస్కరించుకొని గత రెండు రోజులుగా ఆయా గ్రామాలలో చర్చీలను వెలుగులు విరజిమ్మేలా ముస్తాబు చేశారు.

సదాశివనగర్: మండలంలోని పలుగ్రామాల్లో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఆదివారం చర్చీలను రంగులతో అలంకరించారు. మరికొందరు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. క్రిస్మస్ పండుగను జరుపుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. మండలంలోని దగ్గి, మోడెగాం, పద్మాజివాడి, తుక్కోజివాడి, మొద్దేజివాడి తదితర గ్రామాల్లో చర్చీలను అలంకరించారు.

క్రిస్మస్ కిట్లు అందజేత



నవతెలంగాణ-రామారెడ్డి
మండల కేంద్రంలో చర్చిలో ప్రభుత్వం క్రిస్మస్ కిట్లను సొసైటీ వైస్ చైర్మన్ అమ్ముల పశుపతి, స్థానిక నాయకులతో కలిసి క్రిస్టియన్లకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ గొల్లపల్లి లక్ష్మా గౌడ్, కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, ప్రసాద్, మేర రవి తదితరులున్నారు.

గాండ్ల తేలికుల జిల్లా నియోజకవర్గ సంఘాల ఏకగ్రీవ ఎన్నికలు

నవతెలంగాణ-పిట్లం
గాండ్ల తేలికుల జిల్లా, నియోజకవర్గ కమిటీలను మండల కేంద్రంలోని సాయిగార్డెన్స్‌లో రాష్ట్ర సంఘం అధ్యక్షులు ఇందల్వాయి కిషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులుగా గాండ్ల నాగనాథ్ (పిట్లం), జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చాడారపు రాజు రైతన్న (బిచ్కుంద), ఉపాధ్యక్షులుగా గంజిడా సహదేవ్ (బాన్సువాడ), గౌరవ అధ్యక్షులుగా తెలి రఘు ఎంపీపీ (బీర్కూర్), ప్రధాన కార్యదర్శిగా దుద్దుల్ల రాజు (కిష్టాపూర్), కార్యదర్శిగా రాసమల్ల ప్రకాష్ (పిట్లం), కార్యనిర్వహక కార్యదర్శిగా మొండెడ్ల భాస్కర్ (బిచ్కుంద), అధికార ప్రతినిధిగా కాసోల్ల శ్రీనివాస్ (బ్రాహ్మణపల్లి), కోశాధికారిగా కుర్రలేపు లింగం (పిట్లం), జిల్లా యువజన సంఘం అధ్యక్షులుగా కాటేపల్లి గంజివార్ రాము ఎన్నిక కాగా


సంఘాల ఏకగ్రీవ ఎన్నిక

నియోజకవర్గ అధ్యక్షులుగా కాసోల్ల గంగాధర్ (పిట్లం), అధ్యక్షులుగా మొండెడ్ల శ్రావణ్ (పిట్లం), ప్రధాన కార్యదర్శిగా గాండ్ల భీమేష్ (కాటేపల్లి), కార్యదర్శిగా రసమల్ల సాయిలు (పిట్లం), కోశాధికారిగా పిన్నెల వార్ రాము (పిట్లం), బీర్కూర్ మండల అధ్యక్షులుగా బునాది అంబయ్యను ఏకగ్రీవంగా ఎన్నికలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వివిధ మండలాల గాండ్ల తెలికుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో బోరు తవ్వకం పనులు ప్రారంభం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్
మండలంలోని ఆత్మకూరు గ్రామంలో ఆదివారం బోర్ తవ్వకం పనులు ప్రారంభించినట్లు జెడ్పిటిసి సభ్యుడు మనోహర్‌రెడ్డి తెలిపారు. జెడ్పి నిధులతో ఆత్మకూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఈ బోరు నిర్మాణం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బాల్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీడీవో శంకర్

నవతెలంగాణ-రెంజల్
కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శంకర్ కోరారు. ఆదివారం మండలంలోని కళ్యాపూర్ గ్రామంలో వికాసిత్ భారత్ సంకల్ప యాత్రను సర్పంచ్ కాశం నిరంజని సాయిలు అధ్యక్షతను నిర్వహించారు. పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన, తెలంగాణలో మహిళలకు పొగ నుంచే విముక్తికి భరోసా ఇస్తూ ఉజ్వల గ్యాస్ కనెక్షన్ ఉచితంగా పంపిణీ చేయడం, తాగునీటి సదుపాయం కల్పిస్తూ సుమారు రూ.54లక్షల కులాయి కనెక్షన్‌లను


మాట్లాడుతున్న ఎంపీడీవో శంకర్

ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా ఎలాంటి లబ్ధిపొందని వారందరూ ఆయా శాఖలకు అధికారులను సంప్రదించి దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో అన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ గౌస్‌ఉద్దీన్, ఉపసర్పంచ్ జలయ, ఎంపీటీసీ సంయుక్త గంగదాస్, ఆరోగ్య విస్తీర్ణ అధికారి కరిపే రవీందర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రమీలరాణి, వ్యవసాయ విస్తీర్ణ అధికారి అజయ్, ఆరోగ్య కార్యకర్త కళావతి, అంగన్వాడీ, ఆశలు పాల్గొన్నారు.

డి-50 కాలువలోని చెత్త తొలగింపు

నవతెలంగాణ-నవీపేట్



మండల కేంద్రంలోని డి-50 కాలువలోని చెత్తను ఇరిగేషన్ అధికారులు ఆదివారం తొలగించారు. డీ-50 కాలువ చెత్తాచెదారం, చికెన్ సెంటర్ల వ్యర్థాలు, ప్రమాదకర సిరంజిలతో నిండిపోయింది. పలుమార్లు సర్వసభ్య సమావేశంలో ఇరిగేషన్ కాలువలో చెత్తా చెదారంతో రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దృష్టికి వచ్చిన పంచాయతీ పాలకవర్గం, ఇరిగేషన్ శాఖలు స్పందించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కోస్లీలో లిఫ్టు ప్రారంభం సందర్భంగా అధికారులకు నీరు వృధా కాకుండా చూడాలని ఆదేశించారు. స్పందించిన అధికారులు జెసిబితో ఇరిగేషన్ కాలువను శుభ్రం చేశారు. దీంతో స్థానిక ప్రజలతో పాటు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హైస్కూల్ అదనపు గదుల నిర్మాణానికి పూర్వ విద్యార్థుల ఆర్థిక సహాయం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



జక్రాన్‌పల్లి గ్రామంలో ఉన్న స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీకి పూర్వ విద్యార్థి మలవత్ బాలాజీ లక్ష్మణ్ 5వేల రూపాయలు, బానవత్ జగ్మాల్ 5 వేల రూపాయల విరళంగా అందించారని సర్పంచ్ చంద్రకళ బాలకిషన్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. జక్రాన్‌పల్లి గ్రామప్రజల తరపున వారికి వారి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త పైపుల రాజిరెడ్డి, సర్పంచ్ చంద్రకళ, బాలకిషన్ ఎంపీటీసీలు గంగారెడ్డి, తలారి మరియా సతీష్, విడిసి, తదితరులు ఉన్నారు.

ప్రహరీ గోడ పనులను నిలిపివేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని సుద్దపల్లి-దేవ్‌పల్లి సీఎంసీ యాజమాన్యం అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడను నిలిపివేసి వెంటనే తొలగించాలని మండల బీజేపీ అధ్యక్షులు వెంకటరమణ అన్నారు. ఆదివారం డిచ్ పల్లి మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. సుద్దపల్లి రెవెన్యూ పరిధిలోని దేవ్‌పల్లి గ్రామపంచాయతీ తుట్టకుంట కట్ట వెంబడి సీఎంసీ యాజమాన్యం ప్రహరీగోడ నిర్మించిందన్నారు. ఈ అక్రమ కట్టడాలు అధికారుల కళ్లకు కనబడటం లేదా అని ప్రశ్నించారు. సుద్దపల్లి రెవెన్యూకు సంబంధించిన సర్వే నెం. 613లో 10-23 గుంటల భూమి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఇలాంటి చర్యలకు సీఎంసీ యాజమాన్యం పాల్పడటం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. చెరువుకు సంబంధించిన ఇరిగేషన్, ఆర్‌అండ్‌బి అధికారులు ప్రహరీగోడ నిర్మిస్తుంటే ఎలా చూస్తున్నారని, ఈ నిర్మాణాన్ని బీజేపీ కార్యకర్తలు అడ్డుకుంటారన్నారు. లేకుంటే రెవెన్యూకు సంబంధించి సుద్దపల్లి, దేవ్‌పల్లి, అమృతాపూర్ గ్రామాల్లోని ప్రజలు చేరుకుని నిరసన, ర్యాలీ కార్యక్రమాలు చేపడుతారన్నారు. ఈ విషయాన్ని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి పరిశీలించి న్యాయం చేయాలన్నారు. సమావేశంలో బీజేపీ కార్యవర్గ సభ్యులు రవిగౌడ్, అమృతాపూర్ సర్పంచ్ స్వామి, బీజేవైయం మండల అధ్యక్షులు రవి, ఉపాధ్యక్షులు దిలీప్, బాలన్న, తేజ, రాజ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

యూనియన్ అభివృద్ధే ధ్యేయం



మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

యూనియన్ అభివృద్ధే తమ ధ్యేయమని సహారా రియల్ ఎస్టేట్ నిజామాబాద్ యూనియన్ నూతన కార్యవర్గం తెలిపింది. ఆదివారం నిజామాబాద్ నగరంలోని అర్సపల్లిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో సహారా, రియల్ ఎస్టేట్ యూనియన్ నూతన కార్యవర్గానికి ఎన్నికలు నిర్వహించారు. హోరాహోరీగా నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షులుగా సయ్యద్ ఖాజా మోహినుద్దీన్, ప్రధాన కార్యదర్శిగా ఎండి షఫీఉద్దీన్, అధ్యక్షులు పి.అలీమ్ విజయం సాధించారు. సుమారు 1075 మంది యూనియన్‌లో సభ్యత్వం కలిగి ఉన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం మాట్లాడుతూ.. అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తూ యూనియన్ బలోపేతానికి కృషి చేస్తామ న్నారు. మాపై నమ్మకం ఉంచి గెలిపించినందుకు యూనియన్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవీకాలం రెండున్నర సంవత్సరాల కొనసాగుతుందన్నారు. అనంతరం ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గాన్ని యూనియన్ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సహారా రియల్ ఎస్టేట్ యూనియన్ సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన మహాయాగానికి బయలుదేరిన ప్రజలు

నవతెలంగాణ-ఆర్మూర్

రంగారెడ్డి జిల్లా, కడ్తాల్ మండలం అన్మాస్‌పల్లి గ్రామంలో గల మహేశ్వర మహాపిరమిడ్, కైలాసపురి, పత్రీజీ శక్తి స్థల్‌లో ఈనెల 21 నుండి 31 వరకు 11 రోజులపాటు జరిగే ధ్యానమహా యాగానికి ప్రజలు తరలివెళ్లినట్లు పిఎస్ఎస్ఎమ్ జిల్లా అధ్యక్షులు సాయి కృష్ణారెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా నుండి దాదాపు 2వేల మంది ధ్యానులు హాజరైనట్టు చెప్పారు. మహేశ్వర మహా పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయ భాస్కర్ రెడ్డి, ట్రస్టు సభ్యుల ఆధ్వర్యంలో లక్షలాదిగా తరలివచ్చే ధ్యానులకు సకల సౌకర్యాలు కల్పించారు. ఈ 11 రోజులపాటు జరిగే ధ్యాన మహా యాగానికి మొదటి రోజు జిల్లా లోని నందిపేట మండల కేంద్రంలో గల శ్రీ కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు బాలయోగి శ్రీరాములు మహారాజు ముఖ్య అతిథిగా పాల్గొని ఈ వేడుకలను ప్రారంభించారని తెలిపారు. నాలుగవ రోజు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అశేష ప్రజానీకానికి నిజామాబాద్ జిల్లా నుండి వచ్చిన ధ్యానులు పిరమిడ్ సేవాదళ్‌గా ఏర్పడి అన్నప్రసాదం, ఇతర సౌకర్యాలు కల్పించడంలో సేవా కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. పత్రీజీ జన్మించిన జిల్లా నుండి అశేష సంఖ్యలో హాజరై ప్రపంచ నలుమూలల నుండి విచ్చేస్తున్నటువంటి ధ్యానులకు సకల సౌకర్యాలు కల్పించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని సాయి కృష్ణ రెడ్డి తెలిపారు.

ఏర్గట్లలో ఘనంగా మల్లన్న బోనాలు



బోనాలతో వెళ్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా మల్లన్న బోనాల పండుగ ఆదివారం నిర్వహించారు. ఇందుకోసం యాదవ సంఘానికి చెందిన మహిళలు, పురుషులు, పెద్దలు ఉదయం నుండి రాత్రి 8 వరకు ఆహారం తీసుకోక గ్రామం నుండి సుమారు రెండు కిలో మీటర్ల వరకు బోనాలు ఎత్తుకుని కాలినడకన మల్లన్న ఆలయానికి వెళ్ళి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి

- **జిల్లా అడిషనల్ కలెక్టర్ యాదిరెడ్డి**

నవతెలంగాణ-కంఠేశ్వర్

వినియోగదారుల చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ యాదిరెడ్డి అన్నారు. నిజామాబాద్ కలెక్టరేట్లో గల జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం ఆదివారం నిర్వహించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి చంద్ర ప్రకాష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ పి.యాదిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బ్యాంకు వివరాలు ఓటిపి వివరాలు ఎవరికీ చెప్పొద్దని, ఆన్లైన్ షాపింగ్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే తప్పుడు ప్రకటనలకు ఆకర్షితులై మోసపోవద్దని వినియోగదారులను కోరారు. ఈ కామర్స్ డిజిటల్ వర్తక శంఖంలో వినియోగదారులు రక్షణ ఎలక్ట్రానిక్ కామర్స్ అనే నెట్వర్క్ ప్రధానంగా జరిగే ఇంటర్నెట్ ద్వారా వస్తువులు కొనుగోలు సేవ అమ్మకాలు నిధుల డేటా ప్రసారం చేయడం జరుగుతుందని అన్నారు. వీటిపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ యాదిరెడ్డి

తాగునీరు సరఫరా నాన్ ఐఎస్ఐ వాటర్ ప్లాంట్స్ తనిఖీలు నిర్వహించి నిబంధనల ప్రకారం ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. వినియోగదారులు ఏదైనా వస్తువులు కొనుగోలు చేసి మోసపోయినట్లు గ్రహిస్తే తమకు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా వినియోగదారులు వస్తువులు కొనుగోలు చేసినప్పుడు, సేవలు పొందినప్పుడు తప్పకుండా రసీదు బిల్లును తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ కోరారు. బిల్లులు ఉన్నట్లయితే జిల్లా వినియోగదారుల పరిష్కార కమిషన్‌లో కేసు వేసుకోవడానికి వీలు ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం చైర్మన్ మాయావర్ రాజేశ్వర్, జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ సుజాత, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి టి. నాయక్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ జగదీష్, నిజామాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఆనంద్, వినియోగదారుల ప్రతినిధులు లింగయ్య, వినోద్, డాంగే రుక్మయ్య, రమేష్, లింగం, రంజిత్, శేఖర్, నందకుమార్, సంజీవరావు, చౌక ధరల దుకాణాల డీలర్లు, రైస్ మిల్లర్స్, పెట్రోల్ బంక్ డీలర్స్, ఎల్పిజి డీలర్స్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ధర్మారం(బి) విద్యార్థినిలు ఎంపిక

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఆర్మూర్‌లో గల ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో జిల్లా స్థాయి సీనియర్ మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఇందులో డిచ్ పల్లి మండలం లోని ధర్మారం (బీ) తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినిలు సన్నిధి బృంద రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక అయినట్లు ప్రిన్సిపల్ సంగీత ఆదివారం తెలిపారు. ఎంపిక కావడం పట్ల ప్రిన్సిపాల్ సంగీత, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు. ఈనెల 23 నుండి 25 వరకు హిందుస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ గ్రౌండ్ బాలానగర్ సికింద్రాబాద్ జిల్లాలో జరిగే 69వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల పురుషుల బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో పాల్గొంటారని స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ పి.నీరజా రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ పిఈటి జోష్న, హౌస్ టీచర్స్, వైస్ ప్రిన్సిపల్ కిషన్, తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థినులు

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్‌లో సెమీఫైనల్‌కు నిజామాబాద్ మహిళా జట్టు



రాష్ట్రస్థాయికి ఎంపికైన జట్టు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈ నెల 23 నుండి 25వ తేదీ వరకు హిందుస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ బాల్నగర్ సికింద్రాబాద్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ మహిళా, పురుషుల క్రీడా పోటీల్లో నిజామాబాద్ మహిళా జట్టు విజయం సాధించింది. కరీంనగర్ జట్టుపై 35 -27, 35- 27 తేడాతో, రంగారెడ్డి జట్టుపై 35-23, 35-22 తేడాతో, నల్గొండ జట్టుపై 35-21,35-24 తేడాతో, వరంగల్ జట్టుపై 35-30,35-29, తేడాతో విజయం సాధించింది. విన్నర్స్‌గా నిలిచి సెమీఫైనల్ చేరారు. ఈ జట్టును జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షులు మానస గణేష్, ప్రధాన కార్యదర్శి శ్యామ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ, సలహాదారులు ఎన్వి హనుమంత్ రెడ్డి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విద్యాసాగర్ రెడ్డి, మల్లేష్ గౌడ్ ఉపాధ్యక్షులు కిషన్, కిషోర్, రంజిత్, రాజ్ కుమార్, కోశాధికారి రాజేశ్వర్, కృష్ణమూర్తి సంఘ సభ్యులు సురేందర్, నాగేష్, నీరజారెడ్డి, వినోద్, సంజీవ్, మహేష్, సురేష్, శ్రుపాన్, సాయిబాబా, మాధురి, భాగ్యశ్రీ, స్వప్న, భాగ్య అభినందించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

- **మునిపల్లి సర్పంచ్ చిన్న సాయిరెడ్డి**

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ముని పెల్లి సర్పంచ్ చిన్న సాయిరెడ్డి ఆదివారం అన్నారు. మండలంలోని లక్ష్మాపూర్ మునిపెల్లి గ్రామాల్లో వికసిత భారత్ సంకల్ప యాత్రలో భాగంగా భారత సంకల్పయాత్ర వాహనానికి విద్యార్థులు ప్రజలు సపోర్టులతో స్వాగతం పలికారు. వికసిత భారత సంకల్ప యాత్రలో భాగంగా ఇన్చార్జి ఎంపీడీవో బ్రహ్మానందం క్యాలెండరు ఆవిష్కరిస్తూ, భారతదేశ అభివృద్ధికి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మండల స్థాయి అధికారులు తమ శాఖల ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తూ ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా మునిపల్లి సర్పంచ్ సాయిరెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి బీమా యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు, ఫుడ్ ప్రాసెస్ యూనిట్స్, ఎన్నారైలెం స్కీం గురించి వివరిస్తూ అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లక్ష్మాపూర్ సర్పంచ్ కైలాస్, ఉప సర్పంచ్ పిండి సాయన్న, ముని పెల్లి సర్పంచ్ చిన్న సాయిరెడ్డి, ఇన్చార్జి ఎంపిడిఓ బ్రహ్మానందం, ఏపీఓ రవి, కమ్యూనిటీ కోఆర్డినేటర్ గంగాధర్, ఏఈఓ భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ప్రచార రథానికి స్వాగతం పలుకుతున్న విద్యార్థులు, ప్రజలు

బషీరాబాద్‌లో మల్లన్న ఉత్సవాలు ప్రారంభం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామ శివారులోని దూల గుట్టపై కొలువై ఉన్న మల్లన్న స్వామి ఉత్సవాలు ప్రారంభమైనట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. పదకొండు రోజుల పాటు మల్లన్న ఉత్సవాలు కొనసాగుతాయని వెల్లడించారు. ఉత్సవాల రోజు వారీ కార్యక్రమాలలో భాగంగా పల్లకి సేవ (స్వామి వారి ఊరేగింపు)

ఎల్లమ్మ పూజ , గణపతి హెూమం, చండీ యాగం, గంగ నీళ్ల పుట్టమన్ను తేవడం, బోనాల ఊరేగింపు, స్వామివారి కళ్యాణం, అన్నదానం, ఎల్లమ్మ బోనాలు, నాగవెల్లి, అగ్ని గుండాలు, దీక్ష విరమణ చేయడం జరుగుతుందని తెలిపారు. మల్లన్న ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మల్లన్న దీక్షపరులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు పెద్ద ముత్తెన్న, కార్యదర్శి రాజు, మల్కన్న, దేవన్న, సాగర్, సంపత్, చిన్నయ్య, శేఖర్, కుల పెద్ద మనుషులు, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



నేటి నుండి అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ గ్రామంలో సారంగట్టపై నూతనంగా నిర్మించిన అయ్యప్ప ఆలయంలో సోమవారం నుండి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభమవుతాయని గురు స్వామి మేదారం భూమన్న తెలిపారు. ఈనెల 25 నుండి 29 వరకు విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు కన్నుల పండుగగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. అవధూత దత్త పీఠం ఆస్థాన విద్వాంసులు, ద్వీషత ప్రతిష్ఠాపన ఆచార్యులు బ్రహ్మశ్రీ కొడకండ్ల శ్రీరామ శరణ్ శర్మ పర్యవేక్షణలో శివశ్రీ అంగడి మఠం భువనేశ్వరయ్య, జీవంగికర్ పవన్ కుమార్, గురు స్వాములు నాగేష్ శర్మ, వినోద్, భూమండల ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజైన సోమవారం ప్రత్యేక పూజలు ఉంటాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

గోవింద్‌పేట్‌లో మల్లన్న జాతర

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని గోవింద్‌పేట్ గ్రామంలో ఆదివారం మల్లన్న జాతర సంబరాలు ఘనంగా నిర్వహించారు. రథంకు బంతి పూలతో తయారు చేసిన తొట్లెలను పెట్టి ఊరేగింపు నిర్వహించారు. పాడిపంటలు, సుఖ శాంతులతో అందరూ ఉండాలని ఆ మల్లన్న దేవుడిని వేడుకొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బండమీది జమున గంగాధర్, సొసైటీ చైర్మన్ బంటు మహిపాల్, ఎంపీటీసీ యల్ల రాజ్ కుమార్, నోముల అశోక్, బండమీది సుభాష్ , వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.



బాధితునికి ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో ఎన్నికల పోలింగ్ రోజు బిజెపి కార్యకర్త భాగిష్ సోదరి, ఆమె భర్త ఓటు వేయడానికి వచ్చి తిరుగు ప్రయాణంలో లోలం గ్రామం వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఇరువురికి ఆసుపత్రిలో చేర్పించగా ఖర్చు అధికంగా కావడంతో ఎల్లారెడ్డి పల్లి బిజెపి గ్రామ శాఖ అధ్వర్యంలో 10వేలు, నిజామాబాద్ రూరల్ బిజెపి ఇంచార్జీ కులచారి దినేష్ కూమార్ తనవంతుగా 10వేలు మొత్తం ఆర్థిక సహాయాన్ని ఆదివారం బాధిత కుటుంబానికి అందజేశారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. కార్యక్రమం లో బిజెపి మండల అధ్యక్షులు నాయిడి రాజన్న, ఉప సర్పంచ్ జి శ్రీనివాస్, లింగం, నరేష్, పాత్కూరి తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపురం మల్లిఖార్జునస్వామి వారికోత్సవాలు



నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలో ఆదివారం సిరికొండ, హుస్సేన్ నగర్ గ్రామ సంఘాల ఆధ్వర్యంలో పెద్దాపురం మల్లిఖార్జున స్వామి ఎనిమిదవ వార్షికోత్సవ ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతి యేటా షష్టి మాసంలో నాలుగు రోజులు ఈ ఉత్సవాలు గ్రామస్తులు జరుపుకుంటున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు అక్కడే జరిగే ఉత్సవాలను చూడడానికి చుట్టు పక్కల గ్రామస్తుల తరలివచ్చారు, ప్రాచీన కాలం నుండి గొల్ల కుర్మ ఆరాధ్య దైవమైన పెద్దాపురం మల్లికార్జున స్వామి పెళ్లి, అగ్నిగుండం ఆనవాయితీగా జరిపించుకుంటున్నామని గ్రామస్తులు వెల్లడించారు, ఒగ్గు కథ ప్రత్యేకంగా భక్తులను ఆకర్శించింది. భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అన్నదానం నిర్వహించారు.